బంగాళాఖాతంలో అల్పపీడనం

● 12 వరకు వర్షసూచన



అడయార్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తనం కారణంగా బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి ఈ నెల 12 వరకు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం చెన్నై ప్రాంతీయ కార్యాలయం వెల్లడించింది. ఆగ్నేయ బంగాళాఖాతానికి ఆనుకునివున్న కొన్ని ప్రాంతాలో ఉపరితల ఆవర్తనం నెలకొనివుందని ఇది సోమవారం లేదా మంగళవారం దక్షిణ తూర్పు బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉందన్నారు. దాని కారణంగా ఈ నెల 12వ తేదీ వరకు కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో కూడా మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. పగటి ఉష్ణోగ్రతలు ఈ నెల 10వ తేదీ వరకు కొన్ని చోట్ల సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీల వరకు పెరిగే అవకాశముందని తెలిపింది. చెన్నై నగరంలో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. అలాగే, అండమాన్ తీరంలో కేంద్రీకృతమైన అల్పపీడనం క్రమంగా కదులుతూ ఆంధ్రప్రదేశ్ వైపు పయనించవచ్చని అంచనా వేశారు. దీని ప్రభావం కారణంగా ఈ నెల 8, 9, 10, 11 తేదీల్లో రాష్ట్రంలో వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. ప్రధానంగా కోస్తాతీర ప్రాంతాల్లో వర్షం కురుస్తుందని తెలిపింది. అలాగే, కావేరీ డెల్టా జిల్లాలైన కళ్ళకుర్చి, కడలూరు, పెంబలూరు, తంజావూరులలో అర్ధరాత్రి వేళ వర్షం కురుస్తుందని పేర్కొంది.

ఈరోడ్‌లో వర్షబీభత్సం

● అరటి తోటల ధ్వంసం



ఈరోడ్‌లో ఎగిరిన గుడిసెల పైకప్పులు

చెన్నై, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లాలో ఆదివారం సాయంత్రం నుండి సోమవారం వేకువజాము వరకు ఉరుములు మెరుపులు, పెనుగాలులతో కురిసిన కుండపోత వర్షానికి అరటితోటలు ధ్వంసమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జిల్లాలో గత వారం రోజులు వేసవిని తలపించేలా ఎండలు ప్రజలను భయాందోళన కలిగించాయి. రెండు రోజుల క్రితం ఓ మోస్తరు వర్షం కురవగా, ఆదివారం సాయంత్రం హఠాత్తుగా ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులలో కుండపోతగా వర్షం కురిసింది. పెనుగాలులకు నంబియూరు, సూరియంపాళయం వద్ద పాఠశాల సమీపంలో ఐదు భారీ వృక్షాలు నేలకూలాయి. పలుచోట్ల పెంకుటిళ్ల పైకప్పులు, గుడిసెలపై తాటాకుల పైకప్పులు ఎగిరిపోయాయి. పెనుగాలులకు ఆర్జీకే పుదూరుకు చెందిన రాసు అనే వ్యక్తి చెందిన తోటలో 500లకు పైగా అరటిచెట్లు, వట్టకాడు గ్రామంలో నిర్మల్‌కుమార్‌కు చెందిన తోటలో 200 , కుమార్ అనే వ్యక్తికి చెందిన 400 అరటి చెట్లు ధ్వంసమయ్యాయి.

విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి...

ఇదిలా ఉండగా తిరుప్పూరులో కురిసిన భారీ వర్షాలకు ఇద్దరు వ్యక్తులు విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. జిల్లాలోని పల్లడం మహాలక్ష్మినగర్ సమీపంలో పెనుగాలులకు చెట్లు కూలిపడ్డాయి. కామనాయకన్ పాళయం పోలీసుస్టేషన్ సమీపంలో రెండు కొబ్బరి చెట్లు కూలిపడ్డాయి. పలు చోట్లు విద్యుత్ తీగెలు తెగిపడ్డాయి. ఈ నేపథ్యంలో పల్లడటం వద్ద ఇనోద్ (40) అనే వ్యక్తి రోడ్డుపై తెగిపడి ఉన్న విద్యుత్ తీగపై కాలు వేయడంతో కరెంట్‌షాక్‌కు గురై మృతి చెందాడు. ఇదే విధంగా మరో చోట తెగిపడిన విద్యుత్‌తీగను తొక్కటం వల్ల రాజ్ అనే వ్యక్తి మృతి చెందాడు.



విద్యార్థినికి రూ.2లక్షల చెక్కు అందజేస్తున్న ఎస్ఆర్ఎం వర్సిటీ ఛాన్సలర్ పారివేందర్, బీజేపీ నేత అన్నామలై, ఎన్‌టీకే అధినేత సీమాన్, విద్యావేత్త జ్ఞానసంబంధం తదితరులు

తమిళ రాజకీయాల్లో పోరాట యోధుడు సీమాన్

● ఎస్ఆర్ఎం తమిళ్ పేరాయమ్ సభలో అన్నామలై

చెన్నై, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నామ్ తమిళర్ కట్చి సమన్వయకర్త సీమాన్ రాష్ట్ర రాజకీయాల్లో పోరాటయోధుడిలాంటి వారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై అభివర్ణించారు. చెంగల్పట్టు జిల్లా కాట్టాన్‌కుళత్తూరులోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో 'తమిళ్‌పేరాయమ్' ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వక్తృత్వ పోటీ విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం సోమవారం విశ్వవిద్యాలయం ప్రాంగణంలో జరిగింది. ఆ సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, నామ్ తమిళర్‌కట్చి సమన్వయకర్త సీమాన్ ఒకే వేదికపై సందడి చేశారు. తమిళ్‌పేరాయమ్ 'సొల్ తమిళా సొల్' పేరుతో వక్తృత్వపోటీలు నిర్వహించింది. ఈ పోటీలకు ప్రముఖ విద్యావేత్త జ్ఞానసంబంధం న్యాయనిర్ణేతగా వ్యవహరించి విజేతలను ఎంపిక చేశారు. ఆ విజేతలకు ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం ఛాన్సలర్ డాక్టర్ పారివేందర్ బహుమతులను ప్రదానం చేశారు.

సీమాన్‌పై అన్నామలై ప్రశంస...

ఈ సభలో అన్నామలై ప్రసంగిస్తూ నామ్ తమిళర్ కట్చి సమన్వయకర్త సీమాన్‌ను కదనరంగంలో పోరాటయోధుడిగా అభివర్ణించారు. తనకు సీమాన్‌కు ఎలాంటి తేడా లేదని, తాను జాతీయవాదంలో తమిళాన్ని చూస్తుంటే, సీమాన్ తమిళంలో జాతీయ వాదాన్ని చూస్తున్నారని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో తమిళ్‌పేరాయమ్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కరు నాగరాజన్ తదితరులు పాల్గొన్నారు.

రూ.360 కోట్లతో మూడు చేపలరేవులు

● పాంబన్, తంగచ్చిమఠం, కుందుకల్ ప్రాంతాల్లో ఏర్పాటు
● అసెంబ్లీలో గంగపుత్రులపై స్టాలిన్ వరాల జల్లు
● పలు పథకాలకు రూ.216.70 కోట్లు
● లంక జైళ్లలో మగ్గుతున్న తమిళ జాలర్లను పట్టించుకోలేదంటూ ప్రధానిపై విమర్శ



మత్స్యకారులపై వరాలు కురిపిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తమిళ జాలర్లపై శ్రీలంక నావికాదళం దాడులు, అక్రమ నిర్బంధాలను నిరోధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.360 కోట్లతో పాంబన్ సహా మూడు ప్రాంతాల్లో కొత్తగా చేపల రేవులు నిర్మించనుందని ముఖ్యమంత్రి స్టాలిన్ తెలిపారు. ఈ మేరకు సోమవారం శాసనసభలో మత్స్యకారుల సంక్షేమం కోసం కొన్ని ప్రకటనలు చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ శ్రీలంక నావికాదళం రాష్ట్రానికి చెందిన జాలర్లను అక్రమంగా నిర్బంధించడం, వారి పడవలను స్వాధీనం చేసుకోవడం, మత్స్య సంపద, వలలు, సామగ్రిని దోచుకోవడం వంటి అక్రమాలకు పాల్పడుతుండడంతో శాసనసభలో కచ్చాదీవి విముక్తి కోసం ఓ తీర్మానం ఆమోదించి ప్రధాని మోదీ పరిశీలనకు పంపామని, ఇకపై తమిళ జాలర్లపై శ్రీలంక నావికాదళం దాడులు చేయకుండా ఉండేలా శ్రీలంక పర్యటన సందర్భంగా ఆ దేశ పాలకులపు ప్రధాని మోదీ ఒత్తిడి చేయాలని తాను ఓ లేఖ కూడా రాశానని తెలిపారు. శ్రీలంక పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ తమిళ జాలర్ల సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం ఆ దేశ పాలకులతో ఎలాంటి చర్చలు జరుపకుండా తిరిగి రావటం గర్హనీయమన్నారు. ప్రస్తుతం శ్రీలంకై జైళ్లలో మగ్గుతున్న 97 మంది జాలర్లను ప్రధాని మోదీ శ్రీలంక పాలకులతో చర్చలు జరిపి విడుదల చేయిస్తారని ఎంతో ఆశగా ఎదురు చూశామని తెలిపారు. ఎప్పటిలాగే ప్రధాని మోదీ తమిళ జాలర్ల సంక్షేమం కోసం ఆలోచనే లేకుండా శ్రీలంక పర్యటన ముగించుకుని తిరిగొచ్చారని విమర్శించారు.

కేంద్ర ప్రభుత్వం ఆదుకోకపోయినా తమ ప్రభుత్వం జాలర్లను ఆదుకునేందుకు కొన్ని పథకాలు అమలు చేసేందుకు సిద్ధమవుతోందని తెలిపారు. ఆ మేరకు మన్నార్ జలసంధి ప్రాంతం నుంచి రాష్ట్రానికి చెందిన జాలర్లు సముద్రగర్భంలో చేపలు పట్టేందుకు దక్షిణ దిశగా హిందూ మహాసముద్రం వైపు వెళ్లేలా తంగచ్చిమఠం ప్రాంతంలో రూ.150 కోట్లతో చేపలరేవు నిర్మించనున్నామని స్టాలిన్ తెలిపారు. ఇదే విధంగా రూ.60 కోట్లతో పాంబన్ ప్రాంతంలోను, రూ.150 కోట్లతో కుందుకల్ ప్రాంతంలోను చేపలరేవులు నిర్మించనున్నామని, ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చామని, త్వరలో పనులు ప్రారంభం అవుతాయని స్టాలిన్ తెలిపారు. అంతే కాకుండా కడలినాచు పెంపకం, ప్రాసెసింగ్, ఉత్పత్తుల విక్రయాలపై 7వేలమందికి శిక్షణ ఇచ్చి, అవసరమైన ఉపకరణాలను పంపిణీ చేయడానికి రూ.52.33 కోట్ల మేర నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఇదే విధంగా 15300 మంది జాలర్లకు చేపలు, చేపలకు సంబంధించి విలువ ఆధారిత వస్తువులు తయారు చేసేందుకు సాంకేతిక శిక్షణ కోసం రూ.20.55 కోట్లు కేటాయించనున్నట్లు చెప్పారు. 20100 మంది జాలర్లకు లబ్ధి చేకూరేలా రూ.54.48 కోట్లతో పలు పథకాలు రూపొందించి అమలు చేస్తామన్నారు. మత్స్య పరిశ్రమకు అనుబంధంగా ఉండే పుట్టగొడుగుల పెంపక, టూరిస్టు బోట్ల తయారీ, హస్తకళావస్తువులు తయారీ, చిరుధాన్యాల తయారీ వంటి పలు వృత్తులు చేయడం, మసాల పొడులు తయారీ, సౌందరసాధనాలపై శిక్షణ తదితర వృత్తులు చేయడానికి 14700 మంది లబ్ధిపొందేలా రూ.53.62 కోట్ల మేర నిధులు కేటాయించనున్నామని స్టాలిన్ ప్రకటించారు.

నల్లబ్యాడ్జీలతో సభలోకి నిషేధం

● అన్నాడీఎంకే సభ్యుల సస్పెన్షన్
● స్పీకర్ అప్పావు వెల్లడి
● సీఎం వినతితో ఒక రోజుకే పరిమితి

అడయార్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ జరుగుతున్న సమయంలో శాసనసభలోకి జెండాలు గాని, నల్లబ్యాడ్జీలను ధరించి రావడానికి వీల్లేదని సభాపతి అప్పావు స్పష్టం చేశారు. సోమవారం సభలోకి నల్లబ్యాడ్జీలు, ఫ్లాగ్‌లతో వచ్చిన అన్నాడీఎంకే సభ్యులపై స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఈ సభా కార్యక్రమాలు కొనసాగే వరకు సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు. అయితే, సీఎం స్టాలిన్ వినతి మేరకు ఈ సస్పెన్షన్ మంగళవారం వరకే పరిమితం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న బడ్జెట్ అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మంగళవారం జరిగిన సభలోకి ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే సభ్యులు నల్లబ్యాడ్జీలు, జెండాలతో వచ్చి, పోడియం చుట్టుముట్టి నినాదాలు చేశారు. వారిపై స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ, 'అన్నాడీఎంకేకు చెందిన కొందరు సభ్యులు జెండాలు పట్టుకుని, నల్లబ్యాడ్జీలు ధరించి వచ్చారు. వీరందరినీ సభా కార్యక్రమాలు ముగిసేంత వరకు సస్పెండ్ చేయడం జరిగింది. అలాగే, ఇకపై సభలోకి ఏ ఒక్క సభ్యుడు జెండాలు లేదా నల్లబ్యాడ్జీలు ధరించి రావడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఆ తర్వాత సీఎం స్టాలిన్ మాట్లాడుతూ, 'సభాపతి ఒక ప్రకటన చేశారు. అందులో విపక్ష అన్నాడీఎంకే సభ్యులందరినీ ఈ శాసనసభ కార్యక్రమాలు ముగిసేంత వరకు సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ సస్పెండ్‌ను ఒక రోజుకు పరిమితం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను' అని అన్నారు. దీంతో స్పీకర్ అప్పావు... అన్నాడీఎంకే సభ్యులను కేవలం ఒక్క రోజు మాత్రమే సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు.

ఆళ్వార్‌పేట బంగళా ఎదుట గుమికూడిన డీఎంకే కార్యకర్తలు, స్థానికులు



మంత్రి నెహ్రూ, కుటుంబ సభ్యులపై ఈడీ పంజా

● చెన్నై, తిరుచ్చి, కోవైలో ఏకకాలంలో తనిఖీలు

చెన్నై, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): అక్రమ నగదు బట్వాడా అవినీతి కేసు విచారణలో భాగంగా నగరపాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ, ఆయన కుమారుడు, సోదరులకు చెందిన నివాసాలు, వివిధ సంస్థలకు చెందిన కార్యాలయాల్లో సోమవారం ఉదయం ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం (ఈడీ) అధికారులు ఆకస్మిక దాడులు జరిపారు. చెన్నైతో పాటు తిరుచ్చి, కోయంబత్తూరు నగరాల్లో ఒకే సమయంలో పది చోట ఈ సోదాలు జరిగాయి. నగరపాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూకు తిరుచ్చి థిల్లైనగర్‌లో ఇల్లు ఉంది. అయినా చెన్నైలో ప్రభుత్వం కేటాయించిన బంగాళాలోనే కుటుంబంతో నివసిస్తున్నారు. ఆయన కుమారుడు అరుణ్ నెహ్రూ గత లోక్‌సభ ఎన్నికల్లో పెరంబలూరు నియోజకవర్గంలో పోటీ చేసి ఎంపీగా గెలిచారు. అదే విధంగా మంత్రికి రవిచంద్రన్, మణివన్నన్ అనే సోదరులు కూడా ఉన్నారు. రవిచంద్రన్ నగరంలోని రాజా అన్నామలైపురం లో నివసిస్తున్నారు. టీవీహెచ్ (ట్రూ వేల్యూ హోమ్స్) అనే నిర్మాణ సంస్థను, టీవీహెచ్ ఎనర్జీ రిసోర్స్ పేరుతో విద్యుత్ ఇంధన సంస్థ కూడా నడుపుతున్నారు. 2018లో ఈ సంస్థల్లో ఆదాయపు పన్నుల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో లెక్కలో చూపని కోట్లాది రూపాయాలను ఇతర సంస్థలకు అక్రమంగా బట్వాడా జరిగినట్లు గుర్తించారు. వాటికి సంబంధించిన పత్రాలు కూడా స్వాధీనం చేసుకున్నారు. ఆ సందర్భంగా మంత్రి నెహ్రూ సోదరుల సంస్థలకు చెందిన బ్యాంక్ ఖాతాలను పరిశీలించగా చట్ట వ్యతిరేకంగా నగదును పలు సంస్థలకు బట్వాడా చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. ఆ తనిఖీలకు సంబంధించి స్వాధీనం చేసుకున్న దస్తావేజులను ఐటీ అధికారులు ఈడీకి అప్పగించారు. ఆ పత్రాలపై దర్యాప్తును ప్రారంభించిన ఈడీ అధికారులు సోమవారం ఉదయం చెన్నై, తిరుచ్చి, కోయంబత్తూరులో ఉన్న మంత్రి కేఎన్ నెహ్రూ నివాసాలు, ఆయన సోదరులు, కుమారుడి నివాసాల్లో ఆకస్మిక తనిఖీలు జరిపారు. నగరంలోని అడయార్, తేనాంపేట, సీఐటీ కాలనీ, ఎంఆర్‌సీ నగర్, ఆళ్వార్‌పేటలోని మంత్రి నెహ్రూ సోదరుడు రవిచంద్రన్‌కు చెందిన కార్యాలయాలు, నివాసాల్లో సోదాలు నిర్వహించారు. రాజా అన్నామలైపురం కృష్ణాపురిలోని టీవీహెచ్ ఎనర్జీ రిసోర్స్ కార్యాలయంలో అధికారులు తనిఖీ జరిపారు. మంత్రి నెహ్రూ కుమారుడు, పెరంబలూరు ఎంపీ అరుణ్ నెహ్రూకు ఆళ్వార్‌పేటలో ఉన్న జీఎస్ఎన్ఆర్ రైస్ ఇండస్ట్రీస్‌లోనూ అధికారులు సోదాలు జరిపారు. అడయార్ గాంధీ నగర్ నాలుగో వీధిలో వైద్యనాథన్ భవన సముదాయంలోనూ తనిఖీలు కొనసాగాయి.

తిరుచ్చిలో...

తిరుచ్చిలోని మంత్రి నెహ్రూ నివాసంలో, కొన్నేళ్ల క్రితం హత్యకు గురైన ఆయన సోదరుడు రామజయం నివాసంలోనూ మదురై నుండి వచ్చిన ఈడీ అధికారులు తనిఖీ చేశారు. తనిఖీలు జరుగుతుండగా మంత్రి నెహ్రూ అనుచరులు, డీఎంకే స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో గుమికూడారు.

కోవైలో...

కోయంబత్తూరులో మంత్రి నెహ్రూ సోదరుడు మణివన్నన్ నివాసగృహంలో కూడా ఈడీ తనిఖీలు జరిగాయి. ఈ తనిఖీలు సోమవారం సాయంత్రం దాకా కొనసాగాయి.



ఆళ్వార్‌పేటలో ఈడీ తనిఖీ చేస్తున్న బంగళా ఎదుట పోలీసు పహరా

నేత్రపర్వంగా త్యాగరాజస్వామి మహా రథోత్సవం



భక్తజనసంద్రం నడుమ కదులుతున్న మహారథం

టి.నగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తిరువారూరులోని త్యాగరాజస్వామివారి మహారథోత్సవం సోమవారం ఉదయం కనులపండువగా కొనసాగింది. ఆసియాలోనే అతి పెద్ద ఆలయ రథంగా పేరున్న ఈ రథానికి ఇరువైపులా రెండు మోకుతాళ్ల చొప్పున నాలుగు మోకుతాళ్లను కట్టి లాగుతూ భక్తులు ప్రధాన వీధుల్లో ఊరేగించారు. త్యాగరాజస్వామి ఆలయ దివ్యక్షేత్రాల్లో మొదటిది, సర్వదోష పరిహార స్థలంగా, దేవార కీర్తనల్లో చోటుచేసుకుని దక్షిణ కావేరీ నదీ తీరంలోని శైవ క్షేత్రాలలో అత్యంతక శ్రేష్ఠమైనదిగా కీర్తిగించింది. ఇంతటి విశేషాలను సంతరించుకున్న ఈ ఆలయంలో ప్రతియేటా పంగుణి ఉత్తిరం ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తుంటారు. ఈ యేడాదికి సంబంధించి ఉత్సవాలు మార్చి 15న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. మరుసటి రోజు నుండి ఆదివారం రాత్రి వరకూ స్వామి, అమ్మవార్లు ప్రత్యేక అలంకరణలతో వివిధ వాహనాల్లో విహరించారు. ఈ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన 'ఆళి రథోత్సవం' సోమవారం ఉదయం ప్రారంభమైంది. ఈ మహారథోత్సవానికి ముందు ఆదివారం రాత్రి అజపా నృత్యం చేస్తూ స్వామివారు ఆలయం నుండి బయలుదేరి రథంపై ఏర్పాటు చేసిన ప్రత్యేక పీఠాన్ని అధిరోహించారు. సోమవారం ఉదయం రథానికి పూజా కార్యక్రమాలు, దీపారాధన చేసిన అనంతరం రథోత్సవం ప్రారంభమైంది. జిల్లా కలెక్టర్ హేమచంద్రన్, ఎస్పీ కరుణ్ కరాట్, ఎమ్మెల్యే పూండి కలైవానన్ తదితర ప్రముఖులు పచ్చజెండా ఊపగానే రథం బయలుదేరింది. ముందుగా వేకువజాము 5.30 గంటలకు విఘ్నేశ్వరుడు, మురుగన్ దేవతామూర్తులు రథాలు బయలుదేరాయి. ఇక మహారథం వెనుక అమ్మవారి రథం, చండికేశ్వరుల రథాలు కూడా బయలుదేరాయి. 350 టన్నుల బరువైన ఈ రథానికిరువైపులా ఉన్న 425 మీటర్ల పొడవైన మోకుతాళ్లను పట్టుకుని వేలాదిమంది భక్తులు 'ఆరూరా...! త్యాగేశా...' అంటూ నినాదాలు చేస్తూ రథాన్ని లాగారు. ఈ మహారథానికి ముందు శివభక్తులు పంచవాయిద్యాలను మోగిస్తూ, 'దేవార తిరుమురైగల్' పాడుతూ వెళ్ళారు. ఈ రథం తూర్పు వీధి నుండి బయలుదేరి, దక్షిణ వీధి, పడమటి వీధి మీదుగా సోమవారం సాయంత్రానికి రథ మండప ప్రాంతానికి చేరుకుంది. ఈ రథోత్సవంలో పాల్గొన్న భక్తులు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా సుమారు రెండు వేల మంది పోలీసులతో పటిష్టమైన భద్రత కల్పించారు. ఈ రథోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా అంతటా కలెక్టర్ మోహనచంద్రన్ సెలవు ప్రకటించారు.

టాస్మాక్‌లో ఈడీ తనిఖీలపై చర్చకు పట్టు!

● అసెంబ్లీలో అన్నాడీఎంకే సభ్యుల గలాభా
● ఆపై గెంటివేత, రోజంతా సస్పెన్షన్



అసెంబ్లీ నుండి బయటకు వస్తున్న ఈపీఎస్, ఎమ్మెల్యేలు

చెన్నై, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): టాస్మాక్ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈడీ తనిఖీలపై చర్చకు అనుమతించాలంటూ అన్నాడీఎంకే సభాపక్ష నాయకుడు ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) పట్టుబట్టడంతో అసెంబ్లీలో గందరగోళం నెలకొంది. టాస్మాక్‌లో జరిగిన రూ.వెయ్యి కోట్ల అవినీతి వెనుక దాగిన 'ఆ త్యాగి ఎవరు?' అంటూ ముద్రించిన ప్లకార్డులతో అన్నాడీఎంకే సభ్యులంతా నినాదాలు చేశారు. కోర్టు విచారణలో ఉన్న అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించే వీలులేదని, అన్నాడీఎంకే సభ్యులంతా సభను సవ్యంగా నడిపేందుకు సహకరించాలంటూ స్పీకర్ అప్పావు పదేపదే విజ్ఞప్తి చేసినా ఈపీఎస్ సహా ఆ పార్టీ సభ్యులు పట్టించుకోలేదు. దీంతో స్పీకర్ ఆదేశం మేరకు మార్షల్స్ అన్నాడీఎంకే సభ్యులందరినీ సభనుండి గెంటివేశారు. ఆపై అన్నాడీఎంకే సభ్యులందరినీ సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు.

అన్నాడీఎంకే కార్యకర్తలే అసలైన త్యాగులు...

అన్నాడీఎంకే సభ్యులందరినీ సభ నుండి గెంటివేసిన తర్వాత ముఖ్యమంత్రి స్టాలిన్ మాట్లాడుతూ సభలో 'ఆ త్యాగి ఎవరు?' అంటూ ప్లకార్డులతో గలాభా చేసిన ఆ పార్టీ నేతల పరిస్థితిపై ఏవగించుకుంటున్న కార్యకర్తలే అసలైన త్యాగులన్నారు. ఎంజీఆర్, జయలలిత కంటికి రెప్పలా కాపాడిన పార్టీని ఎడప్పాడి తనపై ఉన్న అవినీతి కేసుల నుండి కాపాడుకునేందుకే ఎవరి కాళ్ళపైనో పడి మొక్కుతున్నారని యెద్దేవా చేశారు. ఏ మహిళ కాళ్లపై పడి ముఖ్యమంత్రి పదవిని పొందారో ఆ మహిళ (శశికళ) అసలు సిసలైన త్యాగి అని తాను స్పష్టం చేస్తున్నానన్నారు. ఆ తర్వాత స్పీకర్ అప్పావు మాట్లాడుతూ పార్లమెంట్‌లో ప్లకార్డులు, జెండాలతో వెళ్లేందుకు అనుమతి లేదని, అలాగే అసెంబ్లీలోనూ ప్లకార్డులు తీసుకువచ్చేందుకు వీలు లేనందువల్లే అన్నాడీఎంకే సభ్యులను సస్పెండ్ చేయాల్సి వచ్చిందన్నారు.

వాకౌట్ తర్వాత సభలోకి సెంగోటయ్యన్...

ఇదిలా ఉండగా అన్నాడీఎంకే సభ్యులందరూ గెంటివేతకు గురైన తర్వాత ఆ పార్టీ సీనియర్ సభ్యుడు, మాజీ మంత్రి సెంగోటయ్యన్ మళ్ళీ అసెంబ్లీలోకి ప్రవేశించారు. ఆ సమయంలో సెంగోటయ్యన్ జేబులో 'ఆ త్యాగిఎవరు?' అనే కార్డును స్పీకర్ అప్పావు గమనించారు. ఆ కార్డును తొలగిస్తేనే సభలోకి అనుమతిస్తానని స్పీకర్ చెప్పారు. వెంటనే సెంగోటయ్యన్ జేబులో నుంచి ఆ కార్డును తీసి ఈరోడ్ జిల్లాలో అద్దకపు కర్మాగారం నుండి వెలువడుతున్న రసాయనాల వల్ల గోపిచెట్టిపాళయం భవానీ వాగు కలుషితం కావటంపై తీసుకొచ్చిన సావధానతీర్మానంపై క్లుప్తంగా మాట్లాడి వెళ్ళిపోయారు.

సమాచార దృష్టి

హైకోర్టులో ఉద్యోగావకాశాలు

పెరంబూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మద్రాసు హైకోర్టులో పారిశుధ్య కార్మికులు సహా 152 పోస్టుల భర్తీ నోటిఫికేషన్ విడుదలైంది. హైకోర్టు రిజిస్ట్రార్ అల్లి విడుదల చేసిన ప్రకటనలో... మద్రాసు హైకోర్టులో ఖాళీగా ఉన్న 73 పారిశుధ్య కార్మికులు, తోట కార్మికులు 24, వాటర్‌మాన్ 2, ఆరోగ్య కార్యకర్త 1, వాచ్‌మెన్ 4 సహా 152 పోస్టులు భర్తీచేయనున్నారు. 18 నుంచి 37 ఏళ్లలోపున్న, 8వ తరగతి ఉత్తీర్ణులై, ప్లస్ టూకు పైగా చదవని వారు ఈ పోస్టులకు అర్హులు. రాత పరీక్ష ద్వారా అభ్యర్థుల ఎంపిక జరుగనుంది. ఆసక్తి కలిగిన వారు మే 5వ తేదిలోపు అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. 6వ తేదీ లోపు ఫీజు చెల్లించాల్సి ఉంటుందని రిజిస్ట్రార్ తెలిపారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నైలోని పిల్లల సంరక్షణ కేంద్రాల్లో 184 అంగన్వాడీ ఉద్యోగులు. 22 మైక్రో అంగన్వాడీ ఉద్యోగులు, 102 సహాయకుల పోస్టులు భర్తీ చేయనున్నారు. ప్లస్ టూ ఉత్తీర్ణులై, తమిళం రాయడం, చదవడం తెలిసిన మహిళలు సోమవారం నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే దరఖాస్తుతో పాటు తగిన విద్యార్హత, ఇతర సర్టిఫికెట్లతో తాలూకా పిల్లల సంరక్షణ కార్యాలయాన్ని ఈ నెల 23వ తేది సాయంత్రం 5 గంటల్లోపు నేరుగా అందించవచ్చని చెన్నై జిల్లా యంత్రాంగం ఒక ప్రకటనలో తెలియజేసింది.

19న తిరువళ్లూర్ జిల్లాలో సీఎం పర్యటన

పెరంబూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లాలో ఈ నెల 19వ తేది జరుగనున్న కార్యక్రమంలో ముఖ్యమంత్రి స్టాలిన్ పాల్గొని లబ్ధిదారులకు సంక్షేమ సహాయాలు అందించనున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ప్రతాప్ విడుదల చేసిన ప్రకటనలో... పొన్నేరి తాలూకా ఆండార్‌మఠం ప్రాంతంలో జరిగే కార్యక్రమంలో పాల్గొననున్న ముఖ్యమంత్రి, పలు పథకాలకు శంకుస్థాపన, పూర్తయిన పథకాలకు ప్రారంభోత్సవం చేయనున్నారని కలెక్టర్ ప్రతాప్ తెలిపారు.

నొళంబూర్‌లో రూ.1.63కోట్లతో దహనవాటిక

పెరంబూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక వలసరవాక్కం మండలంలో రూ.1.63 కోట్లతో గ్యాస్ దహన వాటిక ఏర్పాటుచేయనున్నట్లు చెన్నై కార్పొరేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. 143వ వార్డులోని నొళంబూర్ యూనియన్ రోడ్డులో పశుసంవర్ధక శాఖకు చెందిన స్థలంలో కొంత భాగం శ్మశానంగా వినియోగిస్తూ మృతదేహాలు పూడ్చిపెడుతుంటారు. ఈ శ్మశానవాటిక అభివృద్ధి చేసేలా జీసీసీ చర్యలు చేపట్టి దహన వాటిక నిర్మించనుంది.

కొడైకెనాల్ మన్నవనూరు పార్క్ సందర్శనకు అనుమతి

పెరంబూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కొడైకెనాల్ మన్నవనూరులో ఉన్న ఎకో టూరిజం పార్క్‌లో పనులు పూర్తికావడంతో పర్యాటకులకు అనుమతించారు. దిండుగల్ జిల్లా కొడైకెనాల్‌లో అటవీ శాఖ ఆధ్వర్యంలో పలు పర్యాటక ప్రాంతాలుండగా, వాటిలో ముఖ్యమైనది, పర్యాటకులు అధికంగా పర్యటించేది మన్నవనూరు ఎకో పార్క్, కొడైకెనాల్ నుంచి సుమారు 35 కి.మీ దూరంలో మన్నవనూరు నది సమీపంలో ఈ పార్క్ ఏర్పాటుచేశారు. ఈ పార్క్‌ను సందర్శించే పర్యాటకులు బోట్ సవారీ, గుర్రపు సవారీ చేస్తూ ఆనందిస్తుంటారు. పార్క్‌లో చేపట్టిన మరమ్మతుల కారణంగా ఈ నెల 1వ తేది నుంచి పర్యాటకులను అనుమతించలేదు. పనులు పూర్తికావడంతో ఆదివారం నుంచి అనుమతించడంతో పర్యాటకులు హర్షం వ్యక్తం చేశారు.

10న పశువుల కబేళాలు మూసివేత

పెరంబూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మహావీర్ జయంతి సందర్భంగా నగరంలోని పశువుల కబేళాలు ఈ నెల 10వ తేదీ మూసివేయనున్నారు. పెరంబూర్, విల్లివాక్కం, కళ్లికుప్పం, సైదాపేట ప్రాంతాల్లో పశువుల కబేళాలు గురువారం పనిచేయవని, మాంసం వ్యాపారులు సహకారం అందించాలని చెన్నై కార్పొరేషన్ ఒక ప్రకటనలో తెలిపింది.

చేపల వేటకు వెళ్లిన రామేశ్వరం జాలర్లు

పెరంబూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా ఐదు రోజులు చేపల వేటకు వెళ్లని జాలర్లు, సోమవారం ఉదయం చేపల వేటకు బయల్దేరి వెళ్లారు. రామేశ్వరం సమీపం పాంబన్‌లో నూతనంగా నిర్మించిన రైల్వే వంతెనను ఆదివారం ప్రధాని మోదీ ప్రారంభించారు. ప్రధాని పర్యటన దృష్ట్యా రామనాథపురం జిల్లాకు చెందిన జాలర్లు సముద్రంలో చేపల వేటకు వెళ్లేందుకు నిషేధం విధించారు. ఈ నేపథ్యంలో రామేశ్వరానికి చెందిన జాలర్లు సోమవారం ఉదయం అనుమతి టోకెన్లు పొంది సుమారు 500లకు పైగా ఫైబర్ పడవల్లో చేపల వేటకు బయల్దేరి వెళ్లారు.

కొలంబో విమానంలో సాంకేతికలోపం

పెరంబూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనంబాక్కం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి కొలంబోకు బయల్దేరిన విమానంలో ఏర్పడిన సాంకేతిక లోపాన్ని సకాలంలో గుర్తించడంతో పెనుప్రమాదం తప్పింది. నగరం నుంచి శ్రీలంక రాజధాని కొలంబోకు సోమవారం తెల్లవారుజామున 5.45 గంటలకు ఎయిర్ ఇండియా విమానం బయల్దేరింది. 148 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది విమానంలో ఉండగా, విమానం రన్‌వేపై చేరుకున్న సమయంలో సాంకేతికలోపం ఉన్నట్లు పైలెట్ గుర్తించి విమానాశ్రయ అధికారులకు తెలియజేశారు. రన్‌వేపై ఆగిన విమానాన్ని టో ట్రక్ ద్వారా తీసుకొచ్చి, విమానం బయల్దేరే ప్రాంతంలో ఉంచారు. ప్రయాణికులను విమానంలో ఉండాలని తెలిపిన అధికారులు, ఇంజనీర్ల సాయంతో సాంకేతి లోపం సవరించడంతో రెండు గంటలు ఆలస్యంగా 7.40 గంటలకు విమానం బయల్దేరి వెళ్లింది.

కోవైలో ఫ్లైఓవర్ కాంక్రీటు దిమ్మె కూలి కారు ధ్వంసం



కోవై ఉప్పిలిపాళయం వద్ద జరుగుతున్న ఫ్లైఓవర్ నిర్మాణ పనులు (ఇన్‌సెట్లో) ధ్వంసమైన కారు

టి.నగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వాణిజ్యనగరం కోయంబత్తూరు అవినాశి రోడ్డు ఉప్పిలిపాళయం నుండి గోల్డ్‌విన్స్ వరకు నిర్మిస్తున్న ఫ్లైఓవర్ స్తంభాలపైనుంచి ఆదివారం సాయంత్రం కాంక్రీటు దిమ్మె కూలిపడటంతో ఓ కారు ధ్వంసమైంది. కోవైలో కొన్నేళ్లుగా నిర్మిస్తున్న రహదారి వంతెనలు వివాదాస్పదంగా మారుతున్నాయి. వాటి నిర్మాణం నాసిరకంగా ఉండటంతో అప్పుడప్పుడూ ఫ్లైఓవర్‌ల పిట్టగోడలు కూలిపడటం, పైకప్పుల్లో పెచ్చులూడి పడటం వంటి సంఘటనలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో నిర్మాణ దశలోనే ఈ ఫ్లైఓవర్ నుండి సిమెంట్ కాంక్రీటు దిమ్మె కూలిపడటం ఆ నగరవాసులను భయందోళనకు గురిచేస్తోంది. గత డిసెంబర్‌లో హోప్స్ కాలేజీ సమీపంలో వెళుతున్న కారుపై ఓ కాంక్రీటు దిమ్మ కూలిపడింది. ఈ నేపథ్యంలో ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్ మెదదేవ్ చెరియన్ తన కారులో ఆదివారం డ్యూటీకి వెళుతుండగా ఫన్‌మాల్ వద్ద ఉన్నట్టుండి ఫ్లైఓవర్ పైనుంచి ఓ సిమెంట్ కాంక్రీటు దిమ్మె పడింది. దీంతో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. అదృష్టవశాత్తూ ఈ రెండు సంఘటనల్లో ఎలాంటి ప్రాణ నష్టం కలుగలేదు. ఈ విషయమై డాక్టర్ మెదదేవ్ చెరియన్ మాట్లాడుతూ కాంక్రీటు దిమ్మె కూలడం వల్ల కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైందని, వీటి మరమ్మతుకు సుమారు రూ.లక్ష ఖర్చువుతుందని, అయితే కారులో వెళ్లటం వల్ల ప్రాణ నష్టం జరుగలేదని, ఒక వేళ ఆ మార్గంలో మోటారు బైకులో ఎవరైనా వెళితే తప్పకుండా ప్రాణనష్టం జరిగేది కదా అని ప్రశ్నించారు. ప్రస్తుతం ఆ ఫ్లైఓవర్ సమీపంలో వాహనాలు నడిపేందుకు వాహనచోదకులు భయపడుతున్నారని చెప్పారు. ఫ్లైఓవర్ పనులు నాసిరకంగా ఉన్నట్లు ఈ ఘటనలు రుజువు చేస్తున్నాయని, బాధ్యులైన కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈరోడ్‌లో టోల్‌గేట్‌కు వ్యతిరేకంగా కేసు

- కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలకు హైకోర్టు నోటీసు

ప్యారీస్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా అమ్మాపేటలో ఏర్పాటు కానున్న టోల్‌గేట్‌ను వ్యతిరేకిస్తూ దాఖలైన కేసులో కేంద్ర,రాష్ట్రప్రభుత్వాల వివరణ కోరుతూ, మద్రాస్ హైకోర్టు నోటీసులిచ్చింది. భవాని నియోజకవర్గ అన్నాడీఎంకే ఎమ్మెల్యే కరుప్పనన్ మద్రాస్ హైకోర్టులో వేసిన పిటిషన్‌లో అమ్మాపేటలో జాతీయ రహదారుల కమిషన్ టోల్‌గేట్ ఏర్పాటు చేయడానికి వ్యతిరేకంగా స్థానికులు ఆందోళన చేస్తున్నారని, అయినా ప్రజా వ్యతిరేకతను కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని తెలిపారు. ఈ టోల్‌గేట్‌ను ఏర్పాటు చేస్తే అమ్మాపేట చుట్టుపక్కల గ్రామాల రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను సమీపంలోవున్న నగరాలకు తరలించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటారని, అందువల్ల ఈ టోల్‌గేట్ ఏర్పాటు చేయకుండా నిషేధం విధించాలని ఎమ్మెల్యే కోరారు. సోమవారం ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి భరత చక్రవర్తి విచారణ జరుపగా, ఇరు తరుపున న్యాయవాదులు తమ వాదనలను వినిపించారు. అనంతరం ఈ పిటిషన్‌కు ఈ నెల 28వ తేదీలోపు వివరణ ఇవ్వాల్సిందిగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

పాఠశాల వాచ్‌మన్ హత్య


వాచ్‌మెన్ ఇర్ఫాన్ (ఫైల్‌ఫొటో)

టి.నగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తిరుపత్తూరు జిల్లా వాణియంబాడి సమీపం ముస్లీంబూర్ ప్రాంతంలో ప్రైవేటు ప్రాథమిక పాఠశాల వాచ్‌మన్ ఇర్ఫాన్ (40)ను సోమవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హతమార్చారు. ముస్లీంబూర్ ఇక్బార్ రోడ్డులో ఉన్న ప్రైవేటు పాఠశాలలో ఇర్ఫాన్ వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. సోమవారం ఉదయం సైకిలు మీద ఇర్ఫాన్ స్కూలు వెళుతుండగా బైకుపై వచ్చిన గుర్తు తెలియిన వ్యక్తులు అతడితో గొడవపడి పెట్టుకుని మారణాయుధాలతో దాడి చేసి పారిపోయారు. కత్తిపోట్లతో ఇర్ఫాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన గురించి తెలుసుకున్న వాణియంబాడి టౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. డీఎస్పీ విజయకుమార్ హత్యా స్థలాన్ని పరిశీలించారు. ఆ ప్రాంతంలో ఉన్న సీసీ ఫుటేజీ ఆధారంగా హంతులకును గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఈ సంఘటనతో ఇర్ఫాన్ పనిచేస్తున్న పాఠశాలకు సోమవారం సెలవు ప్రకటించారు.

జ్ఞానశేఖరన్‌ను విడుదల చెయ్యొద్దు

- హైకోర్టుకు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం

పెరంబూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): అన్నా విశ్వవిద్యాలయంలో విద్యార్థినిపై లైంగిక వేధింపుల కేసులో అరెస్టయిన జ్ఞానశేఖరన్‌కు వ్యతిరేకంగా నేరారోపణలకు ఆధారాలున్నాయని, అందువల్ల అతడిని ఈ కేసు నుంచి విడుదల చేయవద్దని రాష్ట్ర ప్రభుత్వం తరపున మహిళా ప్రత్యేక కోర్టుకు తెలియజేసింది. అన్నా వర్శిటీ విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడంటూ గత డిసెంబరులో జ్ఞానశేఖరన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో పోలీసులు ఛార్జిషీటు కూడా దాఖలుచేశారు. ఈ నేపథ్యంలో, తనకు వ్యతిరేకంగా నమోదైన కేసుకు ఆధారాలు లేవని, ఈ కేసు నుంచి తనను తప్పించాలని కోరుతూ జ్ఞానశేఖరన్ తరపున మహిళా ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్ సోమవారం న్యాయమూర్తి ఎం.రాజ్యలక్ష్మి విచారించారు. ఈ పిటిషన్ విచారణకు జ్ఞానశేఖరన్‌ను పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. ఆ సమయంలో పోలీసు శాఖ తరఫున దాఖలుచేసిన అఫిడవిట్‌లో... లైంగిక వేధింపుల కేసులో అరెస్టయిన జ్ఞానశేఖరన్‌పై మోపిన నేరారోపణలకు తగిన ఆధారాలున్నాయని, అందువల్ల అతని కేసు నుంచి విడుదల చేయరాదని, అతడు పెట్టుకున్న పిటిషన్ తోసిపుచ్చాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ వాదన అనంతరం తదుపరి విచారణ మంగళవారానికి వాయిదావేస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

కోర్టు ఉద్యోగి ఇంట్లో చోరీకి వెళ్ళిన వ్యక్తి అరెస్ట్

ప్యారీస్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఈస్ట్ మొగప్పేర్ ప్రాంతంలో మద్రాస్ హైకోర్టు ఉద్యోగి ఇంట్లో చోరీకి వెళ్ళిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. హైకోర్టులో పనిచేసే కెనడీ ఈస్ట్ మొగప్పేర్‌లోని టీఎస్‌హెచ్బీ కాలనీలో నివసిస్తున్నారు. ఆయన ఈ నెల 5వ తేదీ ఓ వివాహ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఇంటికి తాళంవేసి కుటుంబం సహా వెళ్ళారు. ఓ వ్యక్తి ఆదివారం రాత్రి 11 గంటల తరువాత ఆ ఇంటి తాళాలు బద్దలుకొట్టి ఇంట్లోకి దూరాడు. తాళాలు పగులగొడుతున్న శబ్ధం విన్న ఇంటిపై పోషన్‌లో ఉంటున్న మోహన్‌ప్రియన్ వెంటనే కిందకి దిగివచ్చి కెనడీ ఇంటి తాళం ధ్వంసమై వుండటం చూసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న జేజేనగర్ పోలీసులు ఆ ఇంట్లో మంచం కింద దాక్కున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతను స్థానిక కొడంగైయూర్‌కు చెందిన బాలా అని తెలిసింది. అతనిపై ఇప్పటికే క్రైమ్ కేసులున్నాయని తెలిపిన పోలీసులు అతడిని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు.

రాష్ట్రంలో 15 నుంచి చేపలవేట నిషేధం

ప్యారీస్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ సంవత్సరానికి సంబంధించి ఈ నెల 15 నుంచి ప్రారంభంకానున్న చేపలవేట నిషేధకాలం 61రోజులు అమలులో వుంటుంది. దీంతో వచ్చే వారంనుండి చేపల ధరలు పెరిగే అవకాశముందని వ్యాపారులు చెబుతున్నారు. సముద్రంలో చేపల సంతానోత్పత్తి పెంచేందుకు సముద్ర గర్భంలో 61రోజుల పాటు ప్రతి ఏటా చేపలవేట నిషేధించడం అనవాయితీ. ఆ మేరకు ఈ ఏడాది నిషేధకాలం 15న ప్రారంభమై, జూన్ 14వ తేదీ వరకు మొత్తం 61రోజులు అమలులో వుంటుంది. ఈ నిషేధం వల్ల చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, కడలూర్, నాగపట్నం, పుదుకోట, రామనాథపురం తదితర 14 కోస్తా జిల్లాలకు చెందిన దాదాపు 25వేలకు పైగా మరపడవలను ఫిషింగ్ హార్బర్లలోనే జాలర్లు లంగరేస్తారు. నిషేధకాలంలో ఉపాధి కోల్పోతున్న జాలర్ల కుటుంబాలకు రాష్ట్రప్రభుత్వం తలా రూ.8 వేలు ఆర్థికసాయాన్ని అందజేస్తుంది. నిషేధకాలంలో జాలర్లు తమ పడవలకు మరమ్మతులు చేపట్టడంతో పాటు చేపలవేటకు అవసరమైన సామగ్రిని సమకూర్చుకుంటారు. కాగా చేపల నిషేధకాలంలో తమకు పంపిణీ చేస్తున్న రూ.8 వేల ఆర్థిక సాయాన్ని రూ.15 వేలకు పెంచాలని జాలర్ల సంఘాలు కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలను విజ్ఞప్తి చేస్తున్నాయి.

సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ మిద్దెపై నుంచి జారిపడి విద్యార్థిని మృతి


మృతురాలు కలైసెల్వి (ఫైల్‌ఫొటో)


పెరంబూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్‌లో తండ్రితో మాట్లాడుతున్న విద్యార్థిని హఠాత్తుగా మిద్దెపై నుంచి జారిపడి మృతి చెందిన ఘటన విషాదం నింపింది. తిరునల్వేలి జిల్లా మేలూరు సమీపంలోని మానూరులోని ఓ కళాశాలలో చదువుతున్న కలైసెల్వి తల్లిదండ్రులు గుజరాత్‌లో వ్యాపారం చేస్తున్నారు. కలైసెల్వి అవ్వ ఇంట్లో ఉంటోంది. ఈ నెల 1వ తేది ఇంటి మిద్దెపై సెల్‌ఫోన్‌లో తండ్రితో మాట్లాడుతున్న కలైసెల్వి హఠాత్తుగా కాలుజారి కిందపడింది. తీవ్రంగా గాయపడిన ఆమెను చుట్టుపక్కల వారు ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స ఫలించక మృతిచెందింది. తల్లిదండ్రుల అనుమతితో కలైసెల్వి అవయవాలు దానంగా తీసుకున్న వైద్యులు, ఆమె మృతదేహానికి ప్రభుత్వం తరపున నివాళులర్పించి తల్లిదండ్రులకు అప్పగించారు.

20 సవర్ల బంగారం దోపిడీ కేసులో ఆరుగురి అరెస్టు

అడయార్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా ఆత్తూరు సమీపంలోని పాలక్కాడు గ్రామానికి చెందిన వేణుగోపాల్ (70)అనే వ్యక్తి నివాసంలో జరిగిన బంగారు నగలు చోరీ కేసులో ఆరుగురు దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. డిటెక్టివ్ ఏజెన్సీలో ప్లాన్ వేసి ఈ దోపిడీకి పాల్పడినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. రిటైర్డ్ వీఏవో అయిన వేణుగోపాల్ గత నెల 29వ తేదీ తన కుటుంబ సభ్యులతో కలిసివుండగా, మొత్తం 9 మంది ముసుగుదొంగలు కత్తులతో వారిని బెదిరించి 20 సవర్ల బంగారు నగలు, రూ.10 వేల నగదు దోచుకుని పారిపోయారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరిపారు. కోయంబత్తూరులోని డిటెక్టివ్ ఏజెన్సీ కంపెనీలో ఈ దోపిడీకి ప్లాన్ వేశారని, ఇందులో తిరుపూర్ సుబాస్ చంద్రబోస్, ఆనంద్‌కుమార్, డిటెక్టివ్ ఏజెన్సీ యజమాని విజయ్, అసిస్టెంట్ సంధ్య, బీజేపీ నాయకుడు అయోధ్యరవి ఉన్నట్టు తేలింది. వీరందరినీ అరెస్టు చేసిన పోలీసులు ఈ దోపిడీ కేసులో సంబంధం ఉన్న వారికోసం గాలిస్తున్నారు.

గ్రీవెన్స్‌లో 26 వినతులు

వేలూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వేలూరు కలెక్టర్ ఆఫీసులో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో 26 వినతుల అందాయి. వాటిని స్వీకరించిన కలెక్టర్ సుబ్బులక్ష్మి వాటిపై సంబంధిత అధికారులను వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆదిద్రావిడ సంక్షేమ శాఖ అధికారి జయభారతి సహా ఇతరశాఖల అధికారులు పాల్గొన్నారు.


కలెక్టర్ సుబ్బులక్ష్మికి వినతులు సమర్పిస్తున్న ప్రజలు

మాతృ వియోగంలోనూ పరీక్షకు హాజరైన విద్యార్థిని

తిరుత్తణి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపంలోని కాళికాపురానికి చెందిన ఓ విద్యార్థిని తన తల్లి మృతి చెందిన బాధతోనే టెన్త్ పరీక్షలకు హాజరైంది. వివరాల్లోకి వెళ్తే మలర్విళి అనే ఓ మహిళ తన భర్తతో కలిసి నేతపని చేసుకుంటూ ఆ గ్రామంలో జీవిస్తుండేది. కొద్దిరోజులుగా మలర్విళికి ఆరోగ్యం బాగోలేదు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఇంట్లో ఆమె స్పృహ కోల్పోయి పడివుండగా గమనించిన ఆమె భర్త వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమెను పరిశీలించిన వైద్యులు మలర్విళి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరైంది. ఈ నేపథ్యంలో ఆమె కుమార్తె మహాలక్ష్మి సోమవారం ఉదయం జరిగిన టెన్త్ పరీక్షకు హాజరు కావాల్సివుంది. తల్లి మరణించిన ఈ పరిస్థితిలో ఆమె కుమార్తె పుట్టెడు బాధతోనే పరీక్షకు హాజరైంది. ఈ బాధాకరమైన సంఘటన ఆ ప్రాంతంలోని పలువురిని కంటతడి పెట్టేలా చేసింది.

ఉరేసుకొని బాలిక ఆత్మహత్య

పెరంబూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఇంటి పనులు చేయలేదని తల్లి మందలిస్తుందన్న భయంతో పదేళ్ల బాలిక ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పల్లావరం సమీపంలో చోటుచేసుకుంది. పొళిచ్చలూరు ఎంజీఆర్ నగర్ మూర్తి వీధికి చెందిన లాజర్ కుమార్తె రోషిణి (10) ఐదవ తరగతి చదువుతోంది. ఘటన జరిగిన రోజున తల్లి కౌసల్య పనికి వెళుతూ, ఇంటిని శుభ్రం చేయాలని కుమార్తెకు చెప్పి వెళ్లింది. సాయంత్రం వరకు ఆడుకుంటున్న రోషిణి ఇంటిని శుభ్రం చేయలేదు. దీంతో, తల్లి వస్తే తిడుతుందని భయపడిన రోషిణి, తమ్ముడు కళ్లెదుటే ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై శంకర్ నగర్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

తాటిచెట్లకు నిప్పంటించిన దుండగులు



వేలూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కాట్పాడి పరిధిలోవున్న బ్రహ్మపురం గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు తాటితోపుకు నిప్పంటించారు. స్థానికుల సమాచారం మేరకు బ్రహ్మపురంలోని ఆదికేశవ వరదరాజ పెరుమాళ్ ఆలయ మాన్యంలోని తాటిచెట్లకు ఆదివారం సాయంత్రం సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. గమనించిన కొందరు గ్రామస్తులు వాళ్లను పట్టుకోడానికి ప్రయత్నించగా, ఆ దుండగులు పరారయ్యారు. దీనిపై అగ్నిమాపక సిబ్బందికి సమాచారమివ్వగా వెంటనే అక్కడికి చేరుకుని వారు మంటలను ఆర్పివేశారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పోలీసులు దీనిపై కేసు నమోదు చేసుకుని ఈ చర్యలకు పాల్పడిన వ్యక్తుల కోసం గాలిస్తున్నారు.

రూ.10 కోట్ల విలువైన రైల్వే స్థలం స్వాధీనం

పెరంబూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరంబూర్‌లో రూ.10 కోట్ల విలువైన రైల్వే స్థలాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పెరంబూర్ రైల్వేస్టేషన్‌కు ఎదురుగా రైల్వేకు చెందిన 6,800 చ.అ స్థలాన్ని పలువురు ఆక్రమించి వ్యాపారరీత్యా వినియోగించుకుంటున్నారు. ఈ విషయమై రైల్వే పోలీసులు సుప్రీంకోర్టులో పిటిషన్ వేయగా, రైల్వేకు అనుకూలంగా గత డిసెంబరులో తీర్పు వచ్చింది. న్యాయస్థానం ఉత్తర్వులతో ఆక్రమణదారులు స్థలం ఖాళీ చేశారు. దీంతో సోమవారం ఉదయం రైల్వే డీఎస్పీ కర్నన్, సీఐ పద్మనాభన్ తదితరులు, ఆ ప్రాంతానికి వెళ్లి 'రైల్వేకు సొంతమైన స్థలం' అంటూ బోర్డు ఏర్పాటుచేశారు. స్వాధీనం చేసుకున్న స్థలం విలువ రూ.10 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు.

వక్ఫ్ చట్టసవరణ బిల్లుకు వ్యతిరేకం

- 12న రాజ్‌భవన్ ముట్టడి
- దౌహీత్ జమాత్ వెల్లడి

ప్యారీస్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ చట్టసరవణ బిల్లును వ్యతిరేకిస్తూ ఈ నెల 12న గిండిలోవున్న రాజ్‌భవన్‌ను ముట్టడించి నిరసన తెలుపనున్నట్లు దౌహీత్ జమాత్ ప్రకటించింది. ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రహీమ్ సోమవారం ప్యారీస్‌లోని కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా వున్న ముస్లింకు చెందిన ఆస్తులను దోచుకోవాలనే ఉద్దేశంతో కేంద్రప్రభుత్వం ఈ నూతన వక్ఫ్ బోర్డు చట్టాన్ని ప్రవేశపెట్టిందని, దీనిని ఉపసంహరించుకోవాలని కోరుతూ తన అధ్యక్షతన రాజ్‌భవన్ ముట్టడి పోరాటం జరుగుతుందని, ఇందులో వేలాది మంది ముస్లింలు పాల్గొంటారని ఆయన తెలిపారు.

దూరవిద్య కోర్సులకు దరఖాస్తు గడువు పొడిగింపు

పెరంబూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): దూరవిద్య కోర్సుల గుర్తింపు పొందేందుకు దరఖాస్తు స్వీకరణ ఈ నెల 15వ తేది వరకు పొడిగించారు. ఈ మేరకు యూజీసీ కార్యదర్శి మనీష్ ఆర్.జోషి విడుదల చేసిన ప్రకటనలో... ప్రస్తుత విద్యా సంవత్సరం దూరవిద్య కోర్సులు ప్రారంభించే ఉన్నత విద్యా సంస్థలు, కోర్సుల అనుమతి కోసం దరఖాస్తు స్వీకరణ మార్చి 4న ప్రారంభమై ఈ నెల 3వ తేదీతో ముగిసిందన్నారు. పలు వర్గాల నుంచి అందిన విజ్ఞప్తుల మేరకు దరఖాస్తు స్వీకరణ గడువు ఈ నెల 15వ తేది వరకు పొడిగించామని, ఆసక్తి కలిగిన విద్యా సంస్థలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం దరఖాస్తు నకలు, తగిన సర్టిఫికెట్లు ఈ నెల 30వ తేదిలోగా ఢిల్లీలోని యూజీసీ ప్రధాన కార్యాలయానికి చేరేలా పంపించాలని, దరఖాస్తులు పరిశీలించి అర్హత కలిగిన విద్యా సంస్థలు దూరవిద్య కోర్సులు ప్రారంభించేందుకు అనుమతులు జారీచేస్తామని యూజీసీ తెలిపింది.

విద్యుత్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు

వేలూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాణిపేట అరక్కోణం విద్యుత్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే అరక్కోణంలోని అమ్మనూర్ దొరస్వామినగర్‌కు చెందిన శరవణన్ అనే ఓ వ్యక్తి తన దుకాణానికి కొత్తగా డొమాస్టిక్ కమర్షియల్ సర్వీస్ కనెక్షన్లు కావాలని కోరుతూ, అధికారులకు విజ్ఞప్తి చేశాడు. దీనిపై విద్యుత్ శాఖ ఏఈ పునీత రూ.లక్ష లంచంగా ఇవ్వాలని శరవణన్‌ను డిమాండ్ చేసింది. దీనిపై శరవణన్ ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయగా ఆకస్మిక తనిఖీలు చేసి, ఆఫీసులోని రూ.65వేల నగదును స్వాధీనం చేసుకుని, లంచం అడిగిన ఇంజనీరు సహా ఆమెకు సహకరించిన ముగ్గురిపై కేసు నమోదుచేశారు.

గొంతులో మాంసం ఇరుక్కుని బాలిక మృతి

పెరంబూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గొంతులో మాంసం ముక్క చిక్కుకోవడంతో శ్వాస తీసుకోలేక బాలిక మృతిచెందిన ఘటన ఈరోడ్ జిల్లాలో చోటుచేసుకుంది. భవాని ప్రాంతానికి చెందిన మునిరాజ్ కుమార్తె వర్షిణి (13) అనే కుమార్తె ఉంది. ఆదివారం మునిరాజ్ కుటుంబసభ్యులు మేక మాంసంతో చేసిన వంటకాలతో భోజనం చేశారు.. ఆ సమయంలో, వర్షిణి గొంతులో మాంసం ముక్క చిక్కుకుంది. కొద్దిసేపటికి వర్షిణి శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడుతుండడాన్ని గుర్తించిన కుటుంబసభ్యులు సమీపంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలికను పరీక్షించిన వైద్యులు, అప్పటికే ఆమె మృతిచెందినట్లు తెలిపారు.

పోక్సో చట్టం కింద ఉపాధ్యాయుడి అరెస్ట్

పెరంబూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడు పోక్సో చట్టం కింద అరెస్టయ్యాడు. తిరువళ్లూర్ జిల్లా ఆర్కే పేట తాలూకాలో ఓ గ్రామానికి చెందిన వ్యక్తి (40) రెండేళ్ల క్రితం ఓ ప్రభుత్వ పాఠశాలలో తాత్కాలిక ఉపాధ్యాయుడిగా చేరాడు. ఆ పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థినితో చనువుగా ఉండడాన్ని గమనించిన పాఠశాల నిర్వాహకులు అతడిని విధుల నుండి తొలగించారు. ఆ తర్వాత కూడా సదరు విద్యార్థినితో చనువుగా ఉంటూ, ప్రేమిస్తున్నానని, వివాహం చేసుకుంటానని నమ్మించి లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. ఈ విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు తెలిపింది. వారు పోలీస్‌లకు ఫిర్యాదుచేశారు. విచారణ చేపట్టిన సీఐ పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి నిందితుడిని అరెస్ట్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

తిరుత్తణి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు సమీపంలోని ఈచంతోపు ప్రాంతంలో రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొని గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో సకాలంలో వైద్యం అందక మృతిచెందాడు. వివరాలిలా.. ఈచంతోపులో భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేసే శివకుమార్ (42) తిరుత్తణిలో ఉన్న తన బంధువుల ఇంటికి వెళ్ళేందుకు బస్టాండుకు బయలుదేరాడు. బస్టాండ్ వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం అతడిని ఢీకొంది. చుట్టుపక్కల వారు అతడిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రి సిబ్బంది, వైద్యులు ఇంకా విధుల్లోకి రాకపోవడంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారమందుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకునేలోపే అతడు వైద్యం అందక మృతిచెందాడు. ఈ విషయం తెలిసిన అతడి కుటుంబసభ్యులు ఆస్పత్రికి చేరుకుని వైద్యులు లేకపోవడం వల్లే అతడు మృతి చెందాడని,, వెంటనే ఆసుపత్రి సిబ్బందిపై చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

హార్బర్‌లో రూ.8.96 కోట్ల వెండి కడ్డీలు మాయం

పెరంబూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీంజూరు సమీపం కాట్టుపల్లిలో ఉన్న ప్రైవేటు హార్బర్ కంటైనర్ నుంచి రూ.8.96 కోట్ల విలువైన వెండి కడ్డీలు అదృశ్యం కావడం కలకలం రేపింది. కాంచీపురం జిల్లా శ్రీపెరుంబుదూర్‌లోని మన్నూరులోని ఓ సంస్థకు లండన్ నుంచి 39 టన్నుల బరువైన 1,305 వెండి కడ్డీలు రెండు కంటైనర్లలో తిరువళ్లూర్ జిల్లా మీంజూరు సమీపంలోని కాట్టుపల్లిలోని హార్బర్‌కు గత నెల 30వ తేది వచ్చాయి.. తండయార్‌పేటలోని ఓ ట్రాన్స్‌పోర్ట్ సంస్థ రెండు లారీల్లో ఈ నెల 3న వెండి కడ్డీల కంటైనర్లను మన్నూరులోని సంస్థ గోడౌన్‌కు తరలించింది. సంస్థ అధికారులు కంటైనర్లను పరిశీలించగా, 1,305 టన్నుల వెండి కడ్డీల్లో 922 కిలోల 30 వెండి కడ్డీలు అదృశ్యం కావడం గమనించారు. కంటైనర్ లారీల్లోని ట్రాకింగ్ డివైజ్‌ను అధికారులు పరిశీలించగా, కంటైనర్లు కాట్టుపల్లి హార్బర్‌లోని సెంట్రల్ ఇండస్ట్రియల్ యార్డులో ఈ నెల 2వ తేది కంటైనర్ తెరచినట్లు గుర్తించారు. సంస్థ గోడౌన్ అధికారి దాసరి శ్రీహరిరావు ఫిర్యాదుతో కాట్టూర్ పోలీసులు విచారణ చేపట్టారు.

3,500 మెగావాట్లు తగ్గిన విద్యుత్ వినియోగం

పెరంబూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా రోజువారీ విద్యుత్ వినియోగం 3,500 మెగావాట్లకు పైగా తగ్గింది. రాష్ట్రంలో రోజువారీ సరాసరి విద్యుత్ వినియోగం 16వేల మెగావాట్లు ఉండగా, వేసవిలో వినియోగం పెరుగుతోంది. ఆ ప్రకారం, గత ఏడాది మే 2వ తేది విద్యుత్ బోర్డు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అత్యధికంగా 20,830 మెగావాట్ల విద్యుత్ వినియోగం నమోదైంది. ఈ నేపథ్యంలో, ఈ ఏడాది మార్చి మొదటి వారం నుంచే ఎండ తీవ్రత అధికం కావడం, పబ్లిక్ పరీక్షల కారణంగా విద్యుత్ వినియోగం పెరిగింది. గత నెల 28వ తేది ఈ ఏడాదిలో రోజువారీ విద్యుత్ వినియోగం అత్యధికంగా 19వేల మెగావాట్లకు చేరింది. ఈ నేపథ్యంలో, కొద్దిరోజులుగా పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తుండడంతో, రోజువారీ విద్యుత్ వినియోగం 3,500 మెగావాట్లు తగ్గి 16,500 మెగావాట్లుగా నమోదైంది. రాబోయే మే, జూన్ నెలల్లో విద్యుత్ వినియోగం 22,000 మెగావాట్లకు చేరే అవకాశముందని విద్యుత్ బోర్డు అధికారులు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ నేతతో బీజేపీ అధ్యక్షుడి భేటీ


కాదర్‌ను శాలువతో సత్కరిస్తున్న దశరథన్

వేలూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా బీజేపీ అధ్యక్షుడు దశరథన్ ఆ ప్రాంత ఎస్సీ, ఎస్టీ విభాగ అధ్యక్షుడు ఖాదర్‌ను సోమవారం ఉదయం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. దశరథన్ అతడిని ఘనంగా సత్కరించారు. ఈ క్రమంలో ఆయనతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన వక్ఫ్ బోర్డు చట్టానికి సానుకూలత వ్యక్తంచేయాలని కోరారు.

ఇంటిపై హక్కు లేదని ప్రమాణపత్రం దాఖలు చేయండి

● రాంకుమార్‌కు హైకోర్టు ఆదేశం


రాంకుమార్

దివంగత నటుడు శివాజీ గణేశన్ రెండో కుమారుడు, సినీ నటుడు ప్రభుకు చెందిన 'అన్నై ఇల్లం'పై ఎలాంటి హక్కు లేదని స్పష్టం చేస్తూ ప్రమాణపత్రం దాఖలు చేయాలని శివాజీ పెద్ద కుమారుడు, నటుడు రాంకుమార్‌కు మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. ఒక చిత్ర నిర్మాణం కోసం రాంకుమార్, ఆయన కుమారుడు, కుటుంబ సభ్యులు కలిసి ధనభాగ్యం ఎంటర్‌ప్రైజెస్ అనే సంస్థ నుంచి రూ.3 కోట్లకుపైగా రుణం తీసుకున్నారు. ఈ మొత్తాన్ని తిరిగి చెల్లించకపోవడంతో ధనభాగ్యం కంపెనీ హైకోర్టును ఆశ్రయించగా రాంకుమార్ ఉంటున్న ఇంటిని జప్తు చేయాలని ఆదేశించింది. దీంతో రాంకుమార్ స్పందించి, ఆ ఇల్లు తనదికాదని, తన సోదరుడు, సినీ నటుడు ప్రభుకు సొంతమని కోర్టుకు తెలిపారు. అదేసమయంలో ప్రభు కూడా కోర్టులో ఒక పిటిషన్ వేశారు. అన్నై ఇల్లం పూర్తిగా తనకు సొంతమైనదని, తన అన్నకు ఎలాంటి హక్కు లేదని, పైగా తన అన్న తీసుకున్న రూ.3 కోట్ల రుణానికి రూ.150 కోట్లకుపైగా విలువ చేసే తన ఇంటిని జప్తు చేయాలంటూ గతంలో కోర్టు జారీ చేసిన జప్తు ఉత్తర్వులు రద్దు చేయాలని కోరారు. ఈ కేసుపై విచారణ సోమవారం మరోమారు జరిగింది. వాదనలు తర్వాత 'అన్నై ఇల్లంలో ఎలాంటి హక్కు లేదని, భవిష్యత్‌లో ఈ ఇంటిపై ఎలాంటి హక్కు కోరబోనని ఒక ప్రమాణపత్రం దాఖలు చేయాలని' ఆదేశిస్తూ, కేసు విచారణను ఈ నెల 9వ తేదీకి కోర్టు వాయిదావేసింది.

ఐకమత్యంతో పనిచేద్దాం

● నిర్మాతల మండలికి టీఎఫ్‌ఏపీఏ పిలుపు

తమిళ చలనచిత్ర నిర్మాతల మండలికి - సినీ నిర్మాణ కార్మికుల సంఘ సమాఖ్య ఫెప్సీకి మధ్య చెలరేగిన ఆధిపత్యపోరు తారస్థాయికి చేరుకున్న నేపథ్యంలో ఐకమత్యంగా కలిసి పనిచేద్దామంటూ తమిళ్ ఫిల్మ్ యాక్టివ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ (టీఎఫ్‌ఏపీఏ) పిలుపునిచ్చింది. మంగళవారం నుంచి తమిళ సినీ నిర్మాతల మండలి సభ్యులైన నిర్మాతలు తెరకెక్కించే చిత్రాలకు ఫెప్సీ కార్మికులు పనిచేయరంటూ ఫెప్సీ అధ్యక్షుడు ఆర్‌కె సెల్వమణి ప్రకటించిన నేపథ్యంలో మురళి రామస్వామి అధ్యక్షుడిగా ఉన్న తమిళ చలనచిత్ర నిర్మాతల మండలికి ప్రముఖ దర్శకుడు భారతీ రాజా సారథ్యంలోని టీఎఫ్‌ఏపీఏ ఈ మేరకు విజ్ఞప్తి చేసింది. ఈ విషయంపై టీఎఫ్‌ఏపీఏ ఒక లేఖ రాసింది. తమిళ చిత్రపరిశ్రమలో సంస్కరణలు చేపట్టి, వాటిని నడిగర్ సంఘం సహా అన్ని సంఘాలతో చర్చించి, సినీ నిర్మాణ వ్యయాన్ని తగ్గించేలా చర్యలు తీసుకుందామని పిలుపునిచ్చింది. మలయాళ చిత్రపరిశ్రమలో ఉన్నట్టుగా వీఎఫ్‌ఎక్స్ చార్జీలను కనిష్ట స్థాయికి తగ్గించాలని కోరింది. చిత్రపరిశ్రమకు పైరసీ అనేది అతిపెద్ద సమస్యగా మారిందని, దానిని నిర్మూలించేలా కట్టుదిట్టమైన చర్యలకు కోరింది. ఫెప్సీతో కలిసి సినిమాలు నిర్మిస్తూ ఖర్చులు తగ్గించేలా విధి విధానాలను రూపొందించడం, చిత్రపరిశ్రమలో నెలకొనివున్న దుర్భరపరిస్థితుల నుంచి గట్టెక్కేందుకు వీలుగా తమిళ సినీ నిర్మాతల మండలితో సహా ఇతర సంఘాలు కలిసి పనిచేయాలని టీఎఫ్‌ఏపీఏ నిర్వాహకులు పిలుపు నిచ్చారు.

పెంచి పోషించిన సినిమాను బతికించండి

● తిరుపూర్ సుబ్రమణ్యం



తమిళ చిత్రజ్యోతి

'మిమ్మలను పెంచి పోషించిన చిత్రపరిశ్రమను బతికించండి' అంటూ హీరోలకు తమిళనాడు థియేటర్స్ మల్టీప్లెక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుపూర్ సుబ్రమణ్యం విజ్ఞప్తి చేశారు. తాజాగా ఆయన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, 'చాలా మంది హీరోలు యేడాదికి ఒక చిత్రంలో మాత్రమే చేస్తున్నారు. అది వారి స్వేచ్ఛ. దీనిపై ఎవరూ కామెంట్స్ చేయలేరు. కొన్నేళ్ళ క్రితం ప్రతి హీరో యేడాదికి కనీసం మూడు నాలుగు చిత్రాల్లో నటించేవారు. ఇపుడు టెక్నాలజీ చాలా రెట్లు పెరిగినప్పటికీ యేడాది ఒక చిత్రంతోనే సరిపెట్టుకుంటున్నారు. రూ.కోట్లలో పారితోషికం తీసుకుంటున్నప్పటికీ అతి తక్కువ రోజులే నటిస్తారు. ఒక హీరో ఒక సినిమాకు 55 రోజులు కేటాయిస్తే చాలు. మిగిలిన రోజులు ఖాళీనే. థియేటర్లు మనుగడ సాగించాలంటూ ప్రతి హీరో కనీసం రెండు చిత్రాల్లో నటించాలి. థియేటర్లను నమ్ముకునే నేటి చిత్రపరిశ్రమ ఉంది. అగ్రస్థానంలో ఉన్న 12 మంది హీరోలు యేడాదికి కనీసం రెండు చిత్రాల్లో నటిస్తే ఏడాదికి 25 పెద్ద హీరోల సినిమాలు విడుదలవుతాయి. ఇది చిత్రపరిశ్రమతో పాటు థియేటర్లకు ఎంతో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పిస్తుంది' అని కోరారు.

అభిమానులపై మాళవిక ఆగ్రహం


మాళవికా మోహనన్

మలయాళ బ్యూటీ మాళవికా మోహనన్ అభిమానులపై మండిపడ్డారు. అర్థం పర్థంలేని ప్రశ్నలు, అర్థాకలితో అరకొర ప్రశ్నలు వేయొద్దంటూ ఆమె హితవు పలికారు. సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'పేట' మూవీ ద్వారా కోలీవుడ్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన మాళవికా మోహన్... ఆ తర్వాత విజయ్, ధనుష్, విక్రమ్ వంటి పెద్ద హీరోల సరసన నటించారు. ప్రస్తుతం తెలుగులో ప్రభాస్ నటించిన 'రాజాసాబ్'తో నటించారు. అలాగే, మలయాళంలో అగ్రనటుడు మోహన్‌లాల్ చిత్రంలో నటించారు. ఈ నేపథ్యంలో ఆమె ఫ్యాన్స్‌తో ముచ్చటించగా, ఆ సమయంలో కొందరు ఫ్యాన్స్ పలురకాలైన ప్రశ్నలు సంధించారు. ఆ ప్రశ్నలకు ఒకింత ఆగ్రహానికిగురైన ఆమె... 'మోహన్‌లాల్‌తో కలిసి నటించిన మూవీ రొమాంటిక్ చిత్రం కాదు. మీ అరకొర పరిజ్ఞానంతో అసంబద్ధమైన ప్రశ్నలు వేయొద్దు. నిరాధారమైన ఊహాగానాలతో సినిమాలను అంచనా వేయకండి' అంటూ ఘాటుగా సమాధానమిచ్చారు.

వళ్లి కుమ్మి నృత్యంలో గిన్నిస్ రికార్డు

● పాల్గొన్న మహిళలను ప్రశంసించిన సీఎం స్టాలిన్


వళ్ళికుమ్మి నృత్యం చేస్తున్న యువతులు, మహిళలు

చెన్నై, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కొంగునాడు కళాత్మక బృందం 'వళ్లి కుమ్మి' నృత్యం ప్రదర్శించి గిన్నిస్ రికార్డు నెలకొల్పిన 16 వేలమంది యువతులకు సీఎం స్టాలిన్ బహుమతులందించి అభినందించారు. గొబ్బెమ్మ వద్ద గొబ్బిళ్ల నృత్యంలా కనిపించే ఈ నృత్యం తమిళ ప్రాచీన కళల్లో ఒకటి. ఈ నృత్యాన్ని బలహీనవర్గాలకు చెందినవారే చేయాలనే కట్టుబాట్లు కూడా ఉండేవి. కాలగమనంలో ఈ వళ్లి కుమ్మి నృత్యం నేర్చుకునేందుకు అన్ని కులాల వారు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ నేపథ్యంలో కోయంబత్తూరు కొటీషియా మైదానంలో జరిగిన ఈ వళ్లి కుమ్మి నృత్య ప్రదర్శనలో వేల సంఖ్యలో యువతులు పాల్గొన్నారు. అందరూ ఒకే రకం దుస్తులు ధరించి ఈ నృత్యం ప్రదర్శించారు. గంటకు పైగా ఈ నృత్యం సాగింది. నీలగిరి జిల్లా పర్యటన ముగించుకుని ఆదివారం సాయంత్రం కోయంబత్తూరు చేరుకున్న ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ నృత్య కార్యక్రమానికి రాగా, సీఎంతోపాటు మంత్రులు దామో అన్బరసన్, సెంథిల్‌బాలాజీ, ఎంపీ రాజా, కొంగునాడు మక్కల్ దేశీయకట్చి నాయకుడు, శాసనసభ్యుడు ఈ ఆర్ ఈశ్వరన్ తదితరులు తిలకించారు.. చివరగా ఈ నృత్య ప్రదర్శనలో పాల్గొన్నవారికి ప్రశంసా పత్రాలు అందజేశారు.


నృత్యం చేస్తున్న యువతులను ప్రోత్సహిస్తున్న సీఎం స్టాలిన్

వైభవంగా వతారణ్యేశ్వర రథోత్సవం



తిరుత్తణి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరువలంగాడులో ప్రసిద్ధి చెందిన వతారణ్యేశ్వరాలయ రథోత్సవం సోమవారం నేత్రపర్వంగా జరిగింది. పంగుణి బ్రహ్మోత్సవాల సందర్భంగా జరిగిన ఈ రథోత్సవానికి రాష్ట్రంలోని జిల్లాల నుండే కాకుండా కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలనుండి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ అధికారి రమణి, నిర్వాహకులు సురేష్ జెండా ఊపి రథోత్సవాన్ని ప్రారంభించారు. శివాచార్యుల వేదమంత్రోచ్చారణ, మంగళవాయిద్యాల నడుమ రథోత్సవం కన్నుల పండువగా సాగింది.

శ్రీరంగం ఆలయంలో భక్తులకు మజ్జిగ



పెరంబూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లా శ్రీరంగం రంగనాథస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు ఆలయంలో మజ్జిగ అందజేస్తున్నారు. రాష్ట్రంలో ఎండలు అధికమవుతుండగా, శుభ ముహూర్తపు రోజులు కావడంతో ఆలయాలకు భక్తులు ఎక్కువగా వస్తున్నారు. ఎండల నుంచి భక్తులు ఉపశమనం పొందేలా ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో, శ్రీరంగనాథస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు ఔషధ గుణం కలిగిన మూలికలు కలిపిన మజ్జిగ అందజేస్తున్నారు. ఎండా కాలం అంతా భక్తులకు మజ్జిగ అందజేయనున్నామని, ఆలయ ప్రాంగణంలో భక్తులు శ్రమ లేకుండా వెళ్లేలా తివాచీలు ఏర్పాటుచేసినట్లు ఆలయ జాయింట్ కమిషనర్ ఎస్.శివకుమార్ తెలిపారు.



హాజరైన భక్తులు - పవిత్ర నదీజలాల కలశాలను ఊరేగిస్తున్న వేదపండితులు

ఘనంగా విశ్వనాథాలయ మహాకుంభాభిషేకం

● హరోంహర నామస్మరణతో మార్మోగిన తెన్‌కాశి


గోపుర కలశాలకు కుంభాభిషేకం చేస్తున్న దృశ్యం

ప్యారీస్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన శివాలయాల్లో ఒకటైన తెన్‌కాశి విశ్వనాథుడి ఆలయం పలు ప్రత్యేకతలను సంతరించుకుంది. దక్షిణ కాశీగా పిలవబడే ఈ ఆలయానికి ప్రతిరోజు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. 2006వ సంవత్సరం ఈ ఆలయంలో మహాకుంభాభిషేకం నిర్వహించారు. 12ఏళ్ళ అనంతరం 2018లో నిర్వహించాల్సివుండగా ఆ ఏడాది జరగలేదు. దీంతో అసంతృప్తి చెందిన భక్తులు కుంభాభిషేకం జరపాలని రాష్ట్రప్రభుత్వానికి విన్నవించుకున్నారు. అదేవిధంగా హిందూ సంస్థలు కూడా అదే అంశంపై డిమాండ్ చేశాయి. దీనిపై స్పందించిన హిందూ దేవాదాయ శాఖామంత్రి పీకే శేఖర్‌బాబు 18ఏళ్ళ అనంతరం ఏప్రిల్ 7న మహాకుంభాభిషేకం జరిపేంచేందుకు ప్రభుత్వం అనుమతిచ్చిందని అసెంబ్లీలో తెలిపారు. ఇందుకోసం కేటాయించిన నిధులతో తెన్‌కాశి విశ్వనాథుడి ఆలయంలో చేపట్టిన జీర్ణోద్ధరణ పనులను పూర్తిచేశారు. ప్రధాన రాజగోపురం, స్వామివారి సన్నిధిని తీర్చిదిద్దారు. ఈ నెల 3వ తేదీ ఆలయ ప్రాంగణంలో నిర్మించిన యాగశాలలో ఆరుజాముల పూజలకు శివాచార్యులు శ్రీకారం చుట్టారు. అమ్మవారి సమేత స్వామివార్లకు ప్రతిరోజు ప్రత్యేక అభిషేకాలు చేశారు. సోమవారం తెల్లవారుజామున 3గంటలకు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, ఆరవజాము పూజలు నిర్వహించారు. ఉదయం 5 గంటలకు వినాయకుడు తదితర పరివార దేవతలకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. 7 గంటలకు మహాపూర్ణాహుతి జరిపి, దేశంలోని పవిత్ర నదుల నుంచి సేకరించిన జలాలతో నింపిన కలశాలను ఆలయం చుట్టు ఊరేగించారు. ఉదయం 9.30 గంటలకు ఆలయ రాజగోపురాలు, విమాన గోపురం, మూలస్థాన ప్రధానమూర్తులకు శివాచార్యుల పూజలు చేసి, మహాకుంభాభిషేకం జరిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ వేడుకల్లో కలెక్టర్ కమల్ కిషోర్, ఎంపీ రాణి శ్రీకుమార్, ఎమ్మెల్యేలు పళని నాడర్, రాజా, దేవాదాయ శాఖ జాయింట్ కమిషనర్ అన్బుమణి తదితరులు పాల్గొన్నారు. రద్దీలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తెన్‌కాశి, తూత్తుకుడి, కన్నియాకుమారి జిల్లాలకు చెందిన సుమారు వెయ్యి మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

కిండర్‌గార్డెన్, అంగన్వాడీల్లో ఉచిత చికిత్స

● ప్రారంభించిన ఎంపీ కళానిధి వీరాస్వామి



చిన్నారులకు ఉచిత వైద్య పరీక్షల పథకాన్ని ప్రారంభిస్తున్న డీఎంకే ఎంపీ

ప్యారీస్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అంగన్వాడీ, కిండర్‌గార్డెన్ పాఠశాలల్లో చదువుతున్న చిన్నారులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించేలా సిమ్స్ ఆస్పత్రి రూపొందించిన పథకానికి డీఎంకే ఎంపీ కళానిధి వీరాస్వామి సోమవారం శ్రీకారం చుట్టారు. ప్రపంచ ఆరోగ్య దినం సందర్భంగా వడపళనిలోని సిమ్స్ ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ కళానిధి వీరాస్వామి కేర్ బేర్స్ న్యూట్రిన్ ద ఫ్యూచర్ అనే పేరుతో చిన్నారులకు ఉచిత వైద్య పరీక్షల పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిమ్స్ యాజమాన్యం అంగన్వాడీ, కిండర్‌గార్డెన్ పాఠశాలల్లో చదువుకుంటున్న ఐదేళ్ళలోపు పిల్లలకు ఆరోగ్యవంతమైన జీవితాన్ని అందించాలన్న సంకల్పంతో ముందుకు రావడం ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సిమ్స్ వైస్ చైర్మెన్ డాక్టర్ రాజు శివస్వామి, ఆసుపత్రి నిర్వాహకులు పాల్గొన్నారు.

● టాస్మాక్‌లో ఈడీ తనిఖీల వ్యవహారం..

విచారణ ఇతర రాష్ట్రాలకు మార్చాల్సిన అవసరం ఏమిటి?

● రాష్ట్ర ప్రభుత్వంపై ఈపీఎస్ ధ్వజం


అసెంబ్లీ నుండి ఎమ్మెల్యేలతో వాకౌట్ చేస్తున్న ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): టాస్మాక్ అవినీతి కేసు విచారణను ఇతర రాష్ట్రాలకు మార్చుచేయాల్సిన అవసరం ఎందుకొచ్చిందని ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అసెంబ్లీలో సోమవారం ఉదయం ఎడప్పాడి మాట్లాడేందుకు స్పీకర్ అప్పావు అనుమతించకపోవడంతో అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు నిరసన తెలుపుతూ సభ నుండి వాకౌట్ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ ప్రాంగణంలో ఈపీఎస్ మాట్లాడుతూ, టాస్మాక్ సంస్థలో రూ. వెయ్యికోట్ల అవినీతి జరిగిందని ఈడీ నివేదిక విడుదల చేసిందని, ఈ అవినీతి గురించి అసెంబ్లీలో మాట్లాడేందుకు తమకు అవకాశం కల్పించలేదన్నారు. టాస్మాక్‌కు సంబంధించి ఈడీ తదుపరి చర్యలు తీసుకోకూడదని కోరుతూ టాస్మాక్ సంస్థ న్యాయస్థానంలో పిటిషన్ వేయడం విడ్డూరంగా ఉందన్నారు. అవినీతికి పాల్పడకపోతే టాస్మాక్ కేసును రాష్ట్రప్రభుత్వం ధైర్యంగా ఎదుర్కోవాలేగానీ, కేసు విచారణను ఇతర రాష్ట్రాలకు బదిలీ చేయాలని కోరడం ఎంత వరకు సమంజసమని ఈపీఎస్ ప్రశ్నించారు. టాస్మాక్ సంస్థ కార్పొరేట్ ఆధీనంలో లేదని, అది ప్రభుత్వ సంస్థ కాబట్టే విచారణ పారదర్శకంగా వుండాలని తమ పార్టీ కోరుతోందన్నారు. ప్రజాధనాన్ని దోచుకున్న వారిని ప్రజల ముందు న్యాయస్థానాలు దోషులుగా నిలబెట్టిన సంఘటనలు ఎన్నో ఉన్నాయన్నారు. కచ్చాదీవి వ్యవహారంలో ముఖ్యమంత్రి స్టాలిన్ కపటనాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. డీఎంకే అధికారంలోవున్న సమయంలోనే కచ్చాదీవిని శ్రీలంక దేశానికి ధారదత్తం చేశారన్న విషయాన్ని ప్రభుత్వం మర్చిపోరాదని సూచించారు. డీఎంకేలో కీలక పదవుల్లో ప్రముఖులు, వారి వారసులు మాత్రమే వుంటారని, ఈ కుటుంబ పాలనకు 2026 అసెంబ్లీ ఎన్నికల్లో ఛరమగీతం పాడేందుకు రాష్ట్రప్రజలు సిద్ధంగా వున్నారని ఈపీఎస్ జోష్యం చెప్పారు.

ఘనంగా గంగ జాతర




వేలూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా గుడియత్తంలో ప్రసిద్ధి చెందిన గంగమ్మ జాతర వేడుకలను ఆలయ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో జరిగిన ముహూర్త స్తంభస్థాపన కార్యక్రమానికి పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని జాతర ప్రారంభించారు. పండితుల వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ భక్తులు కలశాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చి గంగమ్మ తల్లి అభిషేకించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


సచివాలయంలో అసెంబ్లీ తమశాఖలకు సంబంధించిన ఆర్థికపద్దులపై చర్చలు ప్రారంభమవుతున్న సందర్భంగా ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలుసుకున్న మంత్రులు ఎస్. ముత్తుసామి, దామో అన్బరసన్, పీకే శేఖర్‌బాబు, ఆయా శాఖల కార్యదర్శులు తదితరులు


కేథడ్రల్ రోడ్డులోని కలైంజర్ శతజయంతి స్మారక ఉద్యానవనంలో సందర్శకుల కోసం కరూరు వైశ్యాబ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటైన బ్యాటరీ కారును ప్రారంభిస్తున్న మంత్రి తంగం తెన్నరసు


సచివాలయంలో వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ శాసనసభలో ప్రత్యేక తీర్మానం చేసినందుకుగాను తనను కలుసుకుని అభినందించిన చెన్నై, ధర్మపురి, కన్నియాకుమారి, రామనాథపురం శివగంగ, తేని తెన్‌కాశి తదితర జిల్లాలకు చెందిన ముస్లిం మతపెద్దలతో ముఖ్యమంత్రి స్టాలిన్